ఓంశ్రీసాయిరాం

# నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికములను పోషించునదే
# నిజమైన విద్య

ప్రేమస్వరూపులారా!

'చదివితి సకల శాస్త్రములు, నే చదివినవి కలవు పెక్కులు' అని ఈనాటి మానవుడు గర్విస్తున్నాడేగానీ, చదువులలోని మర్మమును తాను గ్రహించలేకపోతున్నాడు. ఈనాటి చదువులలో లౌకిక, భౌతిక విషయములు తప్ప నైతిక, ఆధ్యాత్మిక విషయములు యేమాత్రమూ కనిపించటం లేదు. ప్రపంచంలో ఈనాడు పిల్లలను చదివించే నిమిత్తమై తల్లులు, తండ్రులు అనేకవిధమైన పాట్లు పడుతున్నారు. కాని, చదువంటే ఏమిటనే విషయమును గుర్తించటానికి ఎవ్వరూ ప్రయత్నించటం లేదు. అనేక గ్రంథములు చదివినంత మాత్రమున, చక్కగా మాట్లాడగలిగినంతమాత్రమున విద్యావంతుడని అనిపించుకోలేడు. ఇది కేవలం అక్షరజ్ఞానమే తప్ప అన్యము కాదు.

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానములో 'అష్టదిగ్గజాలు'గా ప్రసిద్ధికెక్కిన అల్లసాని పెద్దన, నంది తిమ్మన, మాదయ్యగారి మల్లన, ధూర్జటి, అయ్యలరాజు రాభద్రుడు, పింగళి సూరన, రామరాజభూషణుడు, తెనాలి రామకృష్ణుడు అనే ఎనమండుగురు కవులుండేవారు. ఒక పర్యాయం కృష్ణదేవరాయలు ఆ ఎనమండుగురు కవులను ఉద్దేశించి, 'మీరంతా గొప్ప పండితులు, సరస్వతీ పుత్రులు. అయితే, నేను మిమ్మల్ని ఒక ప్రశ్న అడుగుతున్నాను. మీలో ఎవరైనా సరే, ఐదు వేర్వేరు భాషలకు చెంది ఐదక్షరాలను చేర్చి ఒక అర్థవంతమైన వాక్యమును చెప్పగలరా?' అని అడిగాడు. ఆ ఐదు అక్షరాలూ ఆయా భాషలలో ఒకే అర్థాన్నిచ్చేవిగా ఉండాలని అన్నాడు. మరునాడు ఉదయానికల్లా తన ప్రశ్నకు సమాధానం చెప్పిన కవిని ఘనంగా సత్కరిస్తానని ప్రకటించాడు. తెనాలి రామకృష్ణుడు లేచి, 'మహారాజా! నేను మా గ్రామానికి వెళ్లి రేపు ఉదయానికల్లా తిరిగి రావటానికి సాధ్యం కాదు. కాబట్టి, ఈ రాత్రికి ఆ ఊర్లోనే బస చేసి, బాగా ఆలోచించి రేపు ఉదయం వచ్చి మీ ప్రశ్నకు సమాధానం చెబుతాను' అన్నాడు. సభ ముగిసిన తర్వాత రామకృష్ణుడు అదే ఊరిలోనున్న తన బావమరిది యింటికి వెళ్లాడు. ఆ రాత్రి పడుకోటనికి రామకృష్ణుని కోసం అతని బావమరిది ఒక మంచం, పరుపు యేర్పాటు చేశాడు. అప్పుడు రామకృష్ణుడు 'బావా! మహారాజు ఒక ప్రశ్న అడిగారు. నేను ఈ రాత్రి బాగా ఆలోచించాలి. పరుపై పడుకుంటే నాకు హాయిగా నిద్ర వస్తుంది. కాబట్టి, పశువుల కొట్టంలో నాకొక మంచం వేయించు' అన్నాడు. అతని కోరిక మేరకు పశువుల కొట్టంలో ఒక మంచం ఏర్పాటు చేశారు. రామకృష్ణుడు ఆ మంచంపై నడుం వాల్చి మహారాజు అడిగిన ప్రశ్న గురించి ఆలోచిస్తున్నాడు. రాత్రి ఒంటిగంటకు ఆ పశువుల కొట్టంలో ఒక ఆవు ఈనటానికి సిద్ధంగా ఉంది. అది గమనించి రామకృష్ణుడు లేచి తలుపు తట్టి, 'బావా! బావా! ఒక ఆవు ఈనుతున్నాది' అని చెప్పాడు. లోపలినుండి బావమరిది, 'ఏ ఆవురా బావా?' అని అడిగాడు. ఎందుకంటే, ఆయన తన ఆవులకు లక్ష్మి, సరస్వతి, రాధ ... అని పేర్లు పెట్టుకున్నాడు. ఈ మాట వినేసరికి రామకృష్ణునికి కావలసిన సమాధానం దొరికిపోయింది. పట్టలేని ఆనందంతో తానుకూడా 'ఏ ఆవురా బావా' అన్నాడు. బావమరిది మళ్లీ, 'ఏ ఆవురా బావా!' అని అడిగాడు. రామకృష్ణుడు, 'ఏ ఆవురా బావా' అని జవాబు చెప్పాడు. రాత్రి సరిగా నిద్ర లేనందున బావగారికి మతి చెడిపోయింది కాబోలు అనుకున్నాడాయన.

రామకృష్ణుడు 'ఏ ఆ వు రా బా వా' అనేది మనసులో పెట్టుకొని తెల్లవారుఝామున లేచి స్నానం చేసి రాజాస్థానానికి వెళ్లాడు. రాయలు 'నేనడిగిన ప్రశ్నకు ఎవరైనా జవాబు తెచ్చారా?' అని అడిగాడు. రామకృష్ణుడు లేచి, 'మహారాజా! ఏ ఆ వు రా బా వా అనే వాక్యంలో మీరు కోరినట్లుగా ఐదు భాషలకు చెంది అక్షరాలున్నాయి. అవి ఆయా భాషలలో ఒకే అర్థాన్నిస్తాయి. మరాఠీలో 'ఏ' అంటే 'రా' అని అర్థం. అదేరీతిగా, హిందీలో 'ఆవ్' అన్నా, తెలుగులో 'రా' అన్నా, కన్నడంలో 'బా' అన్నా, తమిళంలో 'వా' అన్నా అదే అర్థం.' అన్నాడు.

రామకృష్ణుడు చెప్పిన సమాధానానికి ఎంతో సంతోషించి కృష్ణదేవరాయలు బంగారు కాసులు, నవరత్నాలు. యింకా అనేక యితర కానుకలతో అతనిని ఘనంగా సత్కరించాడు. రాజుగారిచ్చిన కానుకలన్నింటినీ మూటకట్టుకున్నాడు. 'ఈ బహుమతులను నేను సంపాయించుకున్నానుగాని, వీటిని రక్షించుకోగలనా? భద్రంగా కాపాడుకో గలనా?' అని అతనికి సందేహం కలిగింది. తాను ఇంటికి చేరుకునేంతవరకు తనకు సహాయంగా యిద్దరు భటులను యిచ్చి పంపవలసినదిగా రాయలవారిని కోరాడు. రామకృష్ణుని కోరిక మేరకు రాయలవారు యిరువురి అంగరక్షకులను అతనికి సహాయముగా యిచ్చి పంపించారు. రామకృష్ణుడు తన యింటికి చేరుకున్న తరువాత యిద్దరు దొంగలుకూడా తనను అనుసరిస్తూ వచ్చి యింటి

వెనుక గల తోటలో దాగుకొని వున్నారని గ్రహించాడు. 'ఇంత విలువైన నవరత్నాలను, బంగారు కాసులను నేనెక్కడ దాచిపెట్టేది?' అని యోచించాడు. అతనకొక ఉపాయం తట్టింది. వెంటనే తన భార్యను పిలచి, 'మన ఊర్లో దొంగల బెడద విపరీతంగా ఉంది కదా! కాబట్టి, రాజుగారిచ్చిన ఈ కానుకల మూటను మన పెరట్లో ఉన్న బావిలో పడేస్తాను. అక్కడైతే యివి భద్రంగా ఉంటాయి' అన్నాడు. ఆ మాటలు దొంగలకు వినపడేటట్లుగా గట్టిగా పలికాడు. వెంటనే కొన్ని రాళ్ళను మూటకట్టి తెచ్చి ఆ బావిలో పడవేశాడు. ఆ తరువాత భార్యాభర్తలు తలుపులు వేసుకొని నిద్రపోతునట్లు నటించారు. ఆ 'బంగారు కాసుల మూట' దొరుకుతుందేమోననే ఆశతో రాత్రంతా దొంగలు ఆ బావినుండి నీళ్ళు తోడుతూనే ఉన్నారు. కానీ, ఎంతసేపు తోడినా బావిలోని నీరు తరిగిపోలేదు. చివరకు విసుగొచ్చి తమ దారిన తాము వెళ్ళిపోయారు. తనకు యేమాత్రం శ్రమ లేకుండా తన తోటలోనున్న మొక్కలన్నింటికీ సమృద్ధిగా జలము అందినందుకు రామకృష్ణుడు సంతోషించాడు.

చావులేని చదువు చదువవలయు

విద్యార్థులారా! మీరు పెద్దపెద్ద పుస్తకాలు చదువుతున్నారు. కాని, అందులోనున్న పదములు, అక్షరములయొక్క అర్థాన్ని సరిగా తెలుసుకోటం లేదు. మన ప్రాచీనులు ప్రతి అక్షరముయొక్క అర్థాన్ని చక్కగా గుర్తించేవారు. అక్షరములు, పదములు, వాక్యములు ఈ మూడింటియొక్క అర్థాన్ని చక్కగా గుర్తించినవాడే నిజమైన కవి.

కవిం పురాణమనుశాసితారణోరణీయాంసమమనుస్మరేద్యః
సర్వస్య ధాతార మచింత్యరూప మాదిత్యవర్ణం తమసపరస్తాత్.

కాని, ఈనాటి ఉపాధ్యాయులు కేవలం లౌకికమైన, భౌతికమైన విషయములనే బోధిస్తున్నారుగాని, నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికములకు సంబంధించిన అర్థములను ఎవ్వరూ బోధించటం లేదు. కనుకనే, ఎన్ని చదువులు చదివినా యేమాత్రము ఫలితము లేకుండా పోతున్నది. నైతికము, ధార్మికము, ఆధ్యాత్మికము... ఈ మూడింటినీ మీరు పోషించాలి. అదియే నిజమైన చదువు. ఈనాటి పిల్లలు, 'ఏమి చేస్తున్నావు నాయనా?' అని అడిగితే 'చదువు కొంటున్నాము' అంటారు. ఇలాంటి చదువు చదువు కాదు. చదువుయొక్క సరైన అర్థమును గుర్తించి వర్తించాలి. ఈనాటి చదువులన్నీ కేవలము భౌతికమైన చదువులే! ఎన్ని చదువులు చదివినప్పటికీ యేదో ఒకనాటికి యివన్నీ వదలిపెట్టి పోవలసిందే! కాబట్టి, చావు లేని చదువు చదవాలి. అట్టి చదువులో ప్రధానంగా ఉండే విలువలు ఐదు. మొట్టమొదటిది సత్యము. truth is one, not two. సత్యము ఒక్కటే. సత్యమునకు మరణం లేదు. సత్యమునుండి ధర్మము, ధర్మము నుండి శాంతి లభిస్తాయి. నాల్గవది ప్రేమ. పుట్టిన బిడ్డ మొదలుకొని మరణించే వృద్ధుని వరకు అందరిలోనూ ప్రేమ ఉన్నది. ప్రేమకు మరణం లేదు. ఐదవది అహింస. 'అహింసా పరమే ధర్మః' అని ప్రబోధించాడు బుద్ధుడు. ఈ ఐదు విలువలను ఆభివృద్ధిపరచుకోండి. అదే చావు లేని చదువు. సత్యమును పలకండి, ధర్మమునాచరించండి. శాంతిని అనుభవించండి. ప్రేమను ఆనందంగా పంచుకోండి. అహింసా మార్గంలో జీవితాన్ని గడపండి. ఇదే విద్యయొక్క సారము. ఈ ఐదు విలువలను మీరు ప్రపంచానికి బోధించండి. ఇవి శాశ్వతమైనవి. ఈనాడు ప్రపంచంలో అందరూ అశాశ్వతమైన వాటికోసమే ప్రాకులాడుతున్నారుగానీ, శాశ్వతమైన ఆనందంకోసం ఎవ్వరూ పాటుపడటం లేదు.

విద్యార్థులారా! మన భారతదేశం ప్రెసిడెంటు చాలా ముఖ్యమైన విషయాలు మీకు బోధించాడు. వాటిని మీరు నిజంగా ఆచరిస్తే ఎంతో ఉన్నత స్థితికి రాగలరు. మానవాకారము ధరించినంత మాత్రమున మీరు మానవులనిపించుకోరు. మానవతా గుణములు గలవాడే నిజమైన మానవుడు. ఈ 'పంచప్రాణాలను' పోషించుకుంటే మనమే పరమాత్మ స్వరుపులమవుతాము. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు దైవమునుండియే ఆవిర్భవించినాయి. ఈ ఐదింటినీ మనము చిన్నతనమునుండియే పిల్లలలో అభివృద్ధి పరచాలి. సత్యమును మనము ఆధారము చేసుకుంటే ఎంతటి ఘనకార్యమునైనా సాధించ వచ్చును.

*ఆచరణలో లేని విద్యలు అవిద్యలే!*

'ఏకైత్మా సర్వభూతాంతరాత్మా'. పేర్లు, రూపములు వేర్వేరుగా కనిపిస్తున్నాయిగానీ, అందరియందున్నది ఒకే ఆత్మ! మీకు ఎన్ని కష్టములు కలిగినా, ఎన్ని నష్టములు సంభవించినా అన్నింటినీ ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోండి. ఏది జరిగినా, 'ఇది నా కర్మయొక్క ప్రతిఫలమే' అని భావించండి. ఎవరిని చూచినా 'వీరు నా ప్రతిబింబమే' అని భావించండి. భగవంతుడు గుణాతీతుడు, కర్మబంధ రహితుడు. అట్టి దైవత్వమును పొందాలంటే త్యాగమే ప్రధానమైనది. ?నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః'. మీరు దేనినైనా త్యాగం చేయటానికి సిద్ధంగా ఉండాలి.

ప్రేమస్వరూపులారా! ఇప్పటికే కాలాతీతమైంది. ఇక ఎక్కువ మాట్లాడి మీకు యిబ్బంది కలిగించటం నాకిష్టము లేదు.

ముముఖ్యంగా ఈ ఐదు మానవతా విలువలను మనస్సులో పెట్టుకొని నిత్యజీవితంలో ఆచరణలో పెడుతూరండి. మానవతా విలువలను గురించి కేవలం చదివినంతమాత్రమున, వ్రాసినంతమాత్రమున అవి అర్థము కావు. ఆచరణే ప్రధానమైనటువంటిది. ఆచరణలో లేని విద్యలు అవిద్యలేగాని నిజమైన విద్యలు కావు. ఏ ఒకటి రెండైనా ఆచరణలో పెట్టండి. అప్పుడే మీరు ధన్యులౌతారు, పుణ్యులౌతారు, సరైన మార్గాన్ని అనుసరించినవారౌతారు. విద్యార్థులారా! మీరు నా మాటలు, కలాం మాటలు ఎన్నో విన్నారు. అయితే, ఒక చెవితో విని, మరొక చెవితో వాటిని బయటికి పంపిస్తే ప్రయోజనం లేదు. ఇలాంటి పవిత్రమైన విషయాలను బోధించేవారు ఈనాడు చాలా అరుదుగా ఉన్నారు. మీకు చిక్కిన ఈ సదవకాశాన్ని మీరు దక్కించుకోండి. మీ జీవిత లక్ష్యమును సాధించండి.

'నీవు, నేను ఒక్కటే'

దైవము ప్రత్యేకంగా లేదు. ఎక్కడ చూచినా భగవంతుడే తప్ప అన్య పదార్థము కనిపించదు. నీవే భగవంతుడవు. 'దైవం మానుషరూపేణ'. మానవులందరూ దైవస్వరూపులే! అందరిలో ఉన్న ఆత్మతత్త్వం ఒక్కటే! మీరు ప్రత్యేకమైనవారు కాదు. 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'. 'మీరందరూ నా అంశములే'. అందుకు తగినట్లుగా నడుచుకోండి. వట్టి మాటలతో కాలమును వ్యర్థం చేయకండి. ఎక్కడ చూచినా ఉన్నది ఏకత్వమే. 'నీవు, నేను ఒక్కటే'. భక్తులు నన్ను అడుగు తుంటారు, 'స్వామీ! ఎవరు మీరు? మీ నిజస్వరూపమేమిటి?'అని. నేను చెబుతాను, 'you and i are one. నీవు వేరు, నేను వేరు కాదు'. 'వారు, వీరు, నేను' అనే భేదము కేవలము భ్రాంతి తప్ప మరొకటి కాదు. మీరందరూ ఏకాత్మస్వరూపులే! కాబట్టి, అందరినీ అన్నదమ్ములుగా, అక్కచెల్లెళ్ళుగా భావించి, ఒకరితో ఒకరు సంబంధ బాంధవ్యాన్ని బలపరచుకోవాలి. అందరూ ఐకమత్యంగా ఉండాలి. కోప, తాప, అసూయ, డంబములకు అవాకశమివ్వకూడదు. ఇవన్నీ ధకరినుండి ఒకరిని దూరము చేసే దుర్గుణములే! ఇటువంటి దుర్గుణములను త్యజించి, ఒకరికొకరికిమధ్య సన్నిహిత సంబంధబాధవ్యమును అభివృద్ధి చేసే సద్గుణములను అలవరచుకోవాలి. దేనికైనా భగవంతునిపై భారము వేయండి. ఇదే ఈనాడు నేను మీకందించే ప్రధాన సందేశము.